
సాక్షి అనకాపల్లి

బుధవారం ၊ 12 ၊ ఫిబ్రవరి ၊ 2025



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మన్యం బంద్ సక్సెస్

స్పీకర్ అయ్యన్నపాత్రుడి వ్యాఖ్యలపై అడవి బిడ్డలు ఆగ్రహించారు. గిరిజనుల బంద్‌తో అల్లూరి సీతారామరాజు జిల్లా స్తంభించిపోయింది. 8లో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 34.5 నుంచి 36.9 డిగ్రీల వరకు నమోదవుతాయని చెప్పారు.

న్యూస్‌రీల్

515 కేజీల గంజాయి పట్టివేత

- ఏజెన్సీ నుంచి ఢిల్లీకి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడి
- దీని విలువ రూ.25.75 లక్షలు ఉంటుందని అంచనా



పట్టుబడిన గంజాయి, నలుగురు నిందితులతో ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఏజెన్సీ నుంచి ఢిల్లీకి గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మాకవరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో పైడిపాల జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 515 కేజీల గంజాయి పట్టుబడింది. ఈ కేసు వివరాలను ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై పి.దామోదర్‌నాయుడు పైడిపాల జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా బొలెరో వ్యాన్‌తోపాటు మరో మూడు మోటర్ సైకిళ్లపై తరలిస్తున్న గంజాయి పట్టుబడింది. పరారవుతున్న నిందితులను పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. చింతపల్లికి చెందిన వంతల మోహన్‌రావు, ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన సిందేరి కుందర, మాకవరపాలెం మండలం సీతన్నగ్రహారానికి చెందిన ఇయ్యపు రాజ్‌కుమార్, నర్సీపట్నానికి చెందిన పల్లా శ్రీనివాసరావులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 22 ప్లాస్టిక్ గోనె సంచులలో పట్టుబడిన 515 కేజీల గంజాయి విలువ సుమారు రూ.25 లక్షల 75 వేలు ఉంటుంది. నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ బాల సూర్యరావు, నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై దామోదర్‌నాయుడు, నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఎస్సైలు, సిబ్బంది, ఐటీ కోర్ టీమ్‌ను అనకాపల్లి ఎస్పీ అభినందించారు.

బడిలో పెద్దపులి !

- వినూత్న రీతిలో విద్యాబోధన



టైగర్‌ను చూపుతూ బోధిస్తున్న ఉపాధ్యాయుడు రాము

మాకవరపాలెం : తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో వినూత్న రీతిలో బోధన సాగిస్తున్నారు. నూతన టెక్నాలజీని వినియోగిస్తూ విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. మంగళవారం పాఠశాల హెచ్‌ఎం కె.రాము ఆగ్మెంటెడ్ రియాలిటీ(ఏఆర్) ద్వారా విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ టెక్నాలజీతో లేనిది ఉన్నట్టు చూపించొచ్చన్నారు. ఈ టెక్నాలజీతో బెంగాల్ టైగర్ మన వద్దే ఉన్నట్టు చూపుతూ బోధన చేశారు. ఈ విధమైన బోధనతో విద్యార్థుల హాజరు శాతం పెరగడమే కాకుండా సులభంగా అర్థమయ్యేందుకు దోహద పడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు తాండవ నల్లగొండమ్మ గిరి ప్రదక్షిణ 8లో

సందట్లో సడేమియా

- 'బాక్సైట్' లారీలతో రహదారులు పాడవుతున్నాయని ఇటీవల ఆందోళన
- 'పయనీర్' సంస్థ సహకారంతో రోడ్డు విస్తరణకు పూనుకున్న ప్రభుత్వం
- అనుమతులు, వేలం లేకుండానే భారీ వృక్షాలను తొలగిస్తున్న వైనం
- ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండి పడుతున్నా పట్టని ఆర్ అండ్ బీ శాఖ



భారీ వృక్షాన్ని తొలగిస్తున్న పొక్లెయిన్



ట్రాక్టర్‌పై కలపను లోడ్ చేస్తున్న దృశ్యం



విశాఖ-నర్సీపట్నం ప్రధాన రహదారిలో భారీ వృక్షాలు

నిబంధనలకు విరుద్ధంగా చెట్ల తొలగింపు

మాకవరపాలెం:

రోడ్డు విస్తరణ పేరుతో అనుమతులు లేకుండా భారీ వృక్షాలను తొలగిస్తున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు అభ్యంతరం చెప్పకపోవడంతో వారికి తెలిసే ఈ చెట్ల తొలగింపు జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.లక్షలు విలువ చేసే కలపను తరలించడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. మండలంలోని రాచపల్లి వద్ద ఉన్న ఆన్‌రాక్ (పయినీర్) అల్యూమినియం రిఫైనరీకి బాక్సైట్ ముడి ఖనిజాన్ని వందలాది లారీలతో నిత్యం విశాఖ పోర్టు నుంచి తరలిస్తున్నారు. పరిమితికి మించిన లోడుతో తిరగడం వల్ల రోడ్లు పాడవడమేగాక ప్రమాదాలు జరుగుతున్నాయంటూ ఈ నెల 5న 120 లారీలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. నాలుగు రోజులపాటు కొనసాగిన ఈ ఆందోళనతో పయినీర్ యాజమాన్యంతోపాటు ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు అధికారుల సమక్షంలో చర్చలు జరిపారు. రోడ్డు విస్తరణతోపాటు మరో 15 డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో లారీలను విడిచిపెట్టారు. ఈ నేపథ్యంలో పయినీర్, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం రెండు రోజులుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పొక్లెయిన్‌లతో మండలంలోని వెంకన్నపాలెం నుంచి రిఫైనరీ మెయిన్ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న భారీ వృక్షాలు, ఇతర చెట్లను తొలగిస్తున్నారు.

ఆర్ అండ్ బీ స్థలంలో ఉన్న వృక్షాలు, చెట్లను తొలగించాలంటే ముందుగా అటవీ శాఖ సిఫార్సుతో చెట్లకు వేలం నిర్వహించాల్సిఉంది. వేలం దక్కించుకున్న వారు నగదు చెల్లించి చెట్లను తరలించాలి. కానీ ఇవేమీ లేకుండా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టానుసారం చెట్లను తొలగించుకుపోతున్నారు. తొలగిస్తున్న వాటిలో మామిడి, నేరేడు, మర్రి, చింత, తాడి, తదితర భారీ చెట్లు ఉన్నాయి. నాలుగు కిలోమీటర్ల పరిధిలో 40కి పైగా ఉన్న భారీ వృక్షాలను ముక్కలుగా కోసి వ్యాన్లు, ట్రాక్టర్లతో ఇతర ప్రాంతానికి తరలించేస్తున్నారు. టన్ను ఒక్కంటికి రూ.3 వేల నుంచి రూ.4 వేలకు అమ్మకాలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా సుమారు రూ.15 లక్షల విలువైన ప్రభుత్వ ఆస్తికి గండి పడుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదు. విశాఖ-నర్సీపట్నం ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణ పేరుతో ఆర్ అండ్ బీకి చెందిన చెట్లను పట్టపగలు తొలగిస్తున్నా సంబంధిత అధికారులు నోరు మెదపడం లేదని, వారికి తెలిసే ఈ తతంగం జరుగుతోందని ఆరోపణలు వినవస్తున్నాయి. రోడ్డు విస్తరణ పనులు ఉపయోగకరమే అయినా అనుమతులు లేకుండా రూ.లక్షల విలువ చేసే చెట్లు మాయం చేయడంపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతులు లేవు

మాకవరపాలెం మండలంలో చెట్ల తొలగింపునకు ఎలాంటి అనుమతులు లేవు. ఆర్ అండ్ బీ శాఖ నుంచి ఏ విధమైన అనుమతి ఇవ్వలేదు. చెట్ల తొలగింపుపై విచారణ చేపట్టి, తొలగించిన వారిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం.

–నారాయణరెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ జేఈ, నర్సీపట్నం

నామినేషన్లన్నీ ఓకే

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన
- 20కి గానూ 16 సెట్లను ఆమోదించిన ఆర్వో



అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి జరుగుతున్న ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థులందరి నామినేషన్ పత్రాలు ఆమోదం పొందాయి. ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎం.నాయక్ ఆధ్వర్యంలో, అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నామినేషన్ పత్రాల పరిశీలన చేపట్టారు. ఒక్కో అభ్యర్థి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాల వివరాలను మిగిలిన వారికి తెలిసేలా చదివి వినిపించారు. కాగా.. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో మొత్తం 10 మంది అభ్యర్థులు 20 సెట్లను సమర్పించారు. ఇందులో నాలుగు సెట్లు సరిగ్గా లేకపోవడంతో ఆర్వో తిరస్కరించారు. సత్తలూరి శ్రీరంగ పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు, పోతల దుర్గారావు రెండేసి సెట్లు వేయగా వాటిల్లో ఒక్కొక్కటి తిరస్కరణకు గురయ్యాయి. అయితే అభ్యర్థులు ప్రత్యామ్నాయ సెట్లు సమర్పించడంతో, వాటిలో సరైన వాటిని పరిగణనలోకి తీసుకొని ఆమోదించారు. పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులు నాయుడు, కోరెడ్ల విజయగౌరి మూడేసి సెట్లు వేయగా అన్నీ అర్హత సాధించాయి. కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ ఒక్కో సెట్ వేయగా ఆమోదం పొందాయి. ప్రమాణాలకు అనుగుణంగా అందరి పత్రాలు ఉండటంతో 10 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదిస్తూ ఆర్వో నిర్ణయించారు.

డీఎంహెచ్‌వో పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీ

- ఓపీ సేవలు, మందుల నిల్వలపై ఆరా
- వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని సూచన

దేవరాపల్లి/కె.కోటపాడు: దేవరాపల్లి, చౌడువాడ పీహెచ్‌సీలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) పి.రవికుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ సేవలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. పీహెచ్‌సీల్లో రికార్డులను పరిశీలించారు. ఓపీ సేవల విభాగం, మందుల నిల్వ గదిని, వార్డును తనిఖీ చేశారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణుల తనిఖీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. గర్భిణులు, పుట్టిన పిల్లల రిజిస్ట్రేషన్‌ను తక్షణమే చేపట్టి, క్షేత్ర స్థాయిలో నాణ్యమైన వైద్యం అందేలా సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులకు సూచించారు. హైరిస్క్ ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రసవ సమయానికి ఆరోగ్యంగా ఉండేటట్టు చూడాలన్నారు. ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేసుకోవడం వల్ల తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని డీఎంహెచ్‌వో చెప్పారు. పూర్తి స్థాయిలో మందులతో పాటు వ్యాక్సిన్‌లను అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. దేవరాపల్లి ఆస్పత్రి ఆవరణలో రూ.1.70 కోట్ల నిధులతో చేపట్టిన అదనపు భవన నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఇదే ఆవరణలో మరో రూ. 50 లక్షలతో చేపట్టనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్(బీహెచ్‌పీయూ) భవన నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన చేశారు. కోవిడ్ సమయంలో ఈ ఐసోలేషన్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేయగా.. నిధులు మంజూరయ్యాయని వైద్యాధికారి పూజ్య మేఘన తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల, పీహెచ్‌ఎన్ బి.సునీత, హెచ్‌వీ బి.లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, ఫార్మాసిస్ట్ అల్లు సత్యమూర్తి, స్టాఫ్ నర్స్ పీడీఎస్ కళావతి, తదితరులు పాల్గొన్నారు.



దేవరాపల్లి పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో పి.రవికుమార్



చౌడువాడ పీహెచ్‌సీలో మందుల నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్

కాశీ నుంచి కాశీకి స్కేటింగ్ యాత్ర



యాత్రలో భాగంగా స్కేటింగ్ చేస్తున్న సోనీ చౌరాసియా



మీడియాతో మాట్లాడుతున్న సోనీ చౌరాసియా

- కథక్ నృత్యకారిణి సోనీ చౌరాసియా సాహసం

యలమంచిలి రూరల్: దేశ సమైక్యత, సమగ్రతలతోపాటు మహిళా సాధికారత లక్ష్యంగా ప్రముఖ కథక్ నృత్యకారిణి సోనీ చౌరాసియా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాశీ నుంచి తిరిగి కాశీకి రోలర్ స్కేటింగ్ యాత్ర చేస్తున్నారు. సుమారు 10,550 కిలోమీటర్ల మేర కొనసాగుతున్న ఈ యాత్ర మంగళవారం యలమంచిలి పట్టణానికి చేరుకుంది. కథక్‌తో పాటు స్కేటింగ్‌లో నైపుణ్యమున్న సోనీ చౌరాసియా గతంలో కూడా ఇదే తరహాలో యాత్రలు చేశారు. ఈసారి ఏకంగా కాశీ నుంచి కాశీ వరకు సుదీర్ఘ యాత్ర చేస్తున్నట్టు ఆమె స్థానిక మీడియాకు తెలిపారు. ఆరోగ్య భారత్ రోలర్ స్కేటింగ్ యాత్ర 2.0తో చేపడుతున్న ఈ యాత్ర దేశంలో 20 రాష్ట్రాలు, 500 పట్టణాలు, నగరాలు, 10 వేల గ్రామాల మీదుగా కొనసాగుతుందన్నారు. ఈ ఏడాది జనవరి 20న కాశీలో ప్రారంభమైన తన యాత్ర వచ్చే మే 12వ తేదీకి తిరిగి కాశీకి చేరుకోవడంతో ముగుస్తుందని సోనీ చౌరాసియా తెలిపారు. మహిళలకు విద్య, రక్షణ, సమానత్వం గురించి యాత్రలో భాగంగా అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

నిరుద్యోగులకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

సింధియా: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైమ్ షిప్ బిల్డింగ్(సెమ్స్)లో టయోట్సు రేర్ ఎర్త్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో సీఎన్‌సీ ఆపరేటర్, ఇన్వెంటరీ కంట్రోలర్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ తదితర ఉపాధి ఆధారిత కోర్సుల్లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సీఈవో సేతు మాధవన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు 18 నుంచి 27 ఏళ్ల వయసు కలిగిన ఇంటర్, ఐటీఐ, డిప్లమో కోర్సుల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులు.

ఆసక్తి కలిగిన విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన అభ్యర్థులు సింధియా జంక్షన్ సమీపంలోని సెమ్స్ కేంద్రంలో గానీ, 86884 11100, 83319 01237, 0891-2704010 ఫోన్ నంబర్లలో గానీ ఈ నెల 17వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

స్వల్పంగా పెరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు

- మొత్తం 22,493 మంది ఓటర్లు
- 123 పోలింగ్ స్టేషన్లు

మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. తొలి విడత జాబితా ప్రకారం 21,555 మంది ఓటర్లు ఉండగా.. ఈనెల 10వ తేదీ వరకు వచ్చిన ఓటర్ల నమోదు దరఖాస్తులను పరిశీలించారు. వీటిని పరిశీలన అనంతరం కొత్తగా 938 మంది ఓటర్లు పెరిగారు.

తుది ఓటర్ల జాబితా ప్రకారం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే మొత్తం 123 పోలింగ్ స్టేషన్లు ఖరారు చేశారు.

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	పోలింగ్ స్టేషన్లు
శ్రీకాకుళం	3,416	1,619	00	5,035 31
విజయనగరం	3,270	1,953	00	5,223 29
మన్యం పార్వతీపురం	1,574	759	00	2,333 15
అల్లూరి సీతారామరాజు	920	568	00	1,488 11
విశాఖపట్నం	2,539	2,990	00	5,529 13
అనకాపల్లి	1,789	1,096	00	2,885 24
మొత్తం	13,508	8,985	00	22,493. 123

ఇండస్ట్రియల్ కారిడార్‌కు నాలుగు లైన్ల రోడ్డు

- నాలుగు కిలోమీటర్ల మేర నిర్మాణం
- ఆర్ అండ్ బీ, ఏపీఐఐసీ అధికారులతో ఆర్డీవో సమావేశం
- భూసేకరణ, పరిహారం చెల్లింపులపై చర్చ



ఏపీఐఐసీ, ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశమైన ఆర్డీవో రమణ

నక్కపల్లి: రాజయ్యపేట, చందనాడ సమీపంలో నిర్మిస్తున్న విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ పార్క్ కోసం 150 అడుగుల వెడల్పుగల నాలుగు లైన్ల రోడ్డు నిర్మించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ మంగళవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ అండ్ బీ, రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో ఇప్పటికే బల్క్‌డ్రగ్ పార్క్ పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. బల్క్‌డ్రగ్ పార్క్, ఇతర పరిశ్రమలు స్థాపించే ప్రాంతానికి కనెక్టివిటీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. జాతీయ రహదారిపై కాగిత నుంచి వేంపాడు, అమలాపురం, పాటిమీద, తమ్మయ్యపేట, మీదుగా నాలుగు లైన్ల రోడ్డు (150 అడుగులు) నిర్మించేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తారు. రూ.28 కోట్లు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన సుమారు 40 ఎకరాలను గుర్తించారు. నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటికే రూ.8 కోట్ల వరకు పరిహారం చెల్లింపులు జరిగాయని అధికారులు ఆర్డీవోకు వివరించారు. జిరాయితీతోపాటు డీ ఫారం, రైతులు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయని, వీరందరికీ నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేస్తామని ఏపీఐఐసీ అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తి చేసి త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్, ఈఈ రమేష్, డీఈ రాధాకృష్ణ, ఏఈ జ్ఞానేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, డీటీలు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా మాఘ పౌర్ణమి జాగరణ

పూడిమడక తీరంలో జాగరణ కోలాహలం, (ఇన్‌సెట్) విద్యుద్దీపాలతో తీరం కళకళ





- పూడిమడక తీరంలో జాతర ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ
- పలు తీరాల్లో నేడు పుణ్య స్నానాలు ఆచరించనున్న భక్తులు

అచ్యుతాపురం:

పూడిమడక మాఘ పౌర్ణమి జాగరణ మంగళవారం సాయంత్రం సందడిగా మొదలైంది. లక్షకు పైగా భక్తులు పాల్గొనే ఈ జాగరణ, పుణ్య స్నానాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని డీఐజీ గోపీనాథ్ జెట్టీ సూచించారు. సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను ఆయన ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ విష్ణుస్వరూప్‌లతో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని డీఐజీ స్థానిక సీఐ గణేశ్‌కు సూచించారు. గజ ఈతగాళ్లకు అందుబాటులో ఉంచాలన్నారు.

శోభాయమానంగా విద్యుద్దీపాలు

సాయంత్రం నుంచి తీర ప్రాంతంలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో పరిసరాలు కళకళలాడాయి. తినుబండారాలు, ఆట వస్తువులు విక్రయించే దుకాణాలతో సందడి నెలకొంది. పూడిమడక ఉన్నత పాఠశాల జంక్షన్ వద్ద పోలీస్ చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఎటువంటి వాహనాలను అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నాటికి భక్తుల తాకిడి మరింత పెరగనుంది.

రేవుపోలవరం తీరంలో విస్తృత ఏర్పాట్లు

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో బుధవారం మాఘపౌర్ణమి జాతర పెద్ద ఎత్తున జరగనుంది. నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, డీఎస్పీ పి.శ్రీనివాసరావు మంగళవారం రేవుపోలవరం తీరానికి వచ్చి ఏర్పాట్లు పరిశీలించారు. మహిళలు వస్త్రాలు మార్చుకునేందుకు తాత్కాలిక మరుగుదొడ్లు, పెద్ద ఎత్తున వచ్చే భక్తులకు అవసరమయ్యే తాగునీటి వసతి తదితర సదుపాయాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. 210 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు డీఎస్పీ చెప్పారు. 20 మంది గజఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. మాఘపౌర్ణమి జాతరకు అడ్డురోడ్డు నుంచి రేవుపోలవరం తీరానికి భక్తులను తరలించేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో చెప్పారు. నర్సీపట్నం, అనకాపల్లి, సింహాచలం, గాజువాక డిపోల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.



పూడిమడక తీరం వద్ద సూచనలు ఇస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ



రేవుపోలవరం తీరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ తదితరులు

క్లుప్తంగా

అయ్యన్న వ్యాఖ్యలు గర్హనీయం

• నల్ల రిబ్బన్లతో గిరిజన సంఘాల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆదివాసీ ఉద్యోగులు

డాబాగార్డెన్స్: ఏజెన్సీలో పర్యాటకాభివృద్ధికి 1/70 చట్టంలో సడలింపులు చేయాలన్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలపై గిరిజన ఉద్యోగులు మండిపడ్డారు. అయ్యన్న చేసిన వ్యాఖ్యలు ఖండిస్తూ.. రెండు రోజుల మన్యం బంద్‌లో భాగంగా మంగళవారం డాబాగార్డెన్స్ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ రిజర్వేషన్ సంరక్షణ సేవా సంఘం, ఐక్యవేదిక, విశాఖ జిల్లా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో కళ్లకు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. 1/70 చట్టం, ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం అమలు చేయాలని, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఆయా సంఘాల ప్రతినిధులు నిరసనలో పాల్గొన్నారు.

ఏయూ టార్గెట్ బాల్ జట్ల ఎంపిక



పురుషుల జట్టుతో వర్సిటీ అధికారులు



మహిళల జట్టుతో ఏయూ అధికారులు

విశాఖ విద్య: ఇంటర్ యూనివర్సిటీ టార్గెట్ బాల్ పోటీల్లో పాల్గొనే ఏయూ పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో ఎంపికైన క్రీడాకారుల జాబితాను వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఆచార్య విజయ్ మోహన్ వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీలో పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పారు. మహిళల విభాగంలో ఏవీఎన్ కళాశాల జట్టు, ప్రగతి కళాశాల జట్టు, గాయత్రి విద్యా పరిషత్ జట్టు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. పురుషుల విభాగంలో ఏవీఎన్ కళాశాల జట్టు, ఏయూ ఆర్ట్స్ కాలేజీ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

రోబోట్లు దగ్ధం

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగి రెండు రోబోట్లు, ఒక ప్యానల్ బోర్డు పూర్తిగా కాలిపోయాయి. సర్వే నంబర్ 230లో ఉన్న ఆజాద్ వీటీసీ ప్రయివేట్ లిమిటెడ్‌కు చెందిన ఈ సంస్థలో అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న తాళ్లవలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి అదుపు చేశారు. అప్పటికే రోబోట్లు కాలిపోయాయని అగ్నిమాపక అధికారి జి. శ్రీనివాసరాజు తెలిపారు. వీటి విలువ రూ.1.50 కోట్లు ఉండవచ్చని అంచనా.. అయితే వాటి యజమాని వచ్చే వరకు నష్టం అంచనా వేయలేమని అగ్నిమాపక అధికారి తెలిపారు.

బంద్ సక్సెస్



పాడేరు డిపోలో నిలిచిపోయిన బస్సులు

- అయ్యన్న వ్యాఖ్యలపై ఆగ్రహించిన అడవి బిడ్డలు
- తెల్లవారు జామునుంచే రోడ్లపైకి వచ్చిన అఖిలపక్ష నేతలు
- డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- మూతబడిన వర్తక, వాణిజ్య సముదాయాలు
- తిరగని ప్రైవేటు వాహనాలు
- పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబుతో సహా నేతలు రోడ్లపై బైఠాయింపు
- రోడ్లపైనే భోజనాలతో నిరసన

పాడేరు: గిరిజనుల ప్రధాన చట్టం 1/70ను సవరించి టూరిజం అభివృద్ధి చేయాలన్న శాసన సభ స్పీకర్ వ్యాఖ్యలపై గిరిజనులు భగ్గుమన్నారు. అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలకు నిరసనగా చేపట్టిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ మంగళవారం విజయవంతంగా జరిగింది. పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో అఖిలపక్షంగా ఏర్పడిన సీపీఎం,



బంద్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబు తదితరులు

సీపీఐ తదితర రాజకీయ పార్టీలు, దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్, పలు గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాల సభ్యులు జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు అన్ని మండలాల్లో వేకువజాము నుంచే రోడ్లపైకి వచ్చి బంద్ నిర్వహించారు. ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవిబాబు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స, సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర,గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్ కేంద్ర ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం, నాయకులు పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. అయ్యన్నపాత్రుడికి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంప్లెక్స్ వద్ద పాడేరు సీఐ దీనబంధు ఆధ్వర్యంలో భారీ ఎత్తున బందోబస్తు నిర్వ



బంద్‌లో పాడేరు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతోపాటు వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు

హించారు. అరకులోయలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు, డుంబ్రిగుడ, హుకుంపేట, అరకులోయలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, హుకుంపేట, పాడేరు ఘాట్‌లోని 12వ మైలురాయి జంక్షన్ వద్ద ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ స్వాతిరాణి, వైఎస్సార్‌సీపీ నేతలు ఆందోళన చేసి, వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పాడేరులో మాజీ ఎమ్మెల్యే, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పెదబయలులో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో నేతలు రోడ్లపై బైఠాయించారు.

స్తంభించిన జనజీవనం

జిల్లా వ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. ఎక్కడికక్కడ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పాడేరుతో పాటు అన్ని మండల కేంద్రాల నుంచి విశాఖ, ఎస్.కోట, చోడవరం, నర్సీపట్నం ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు తిరగలేదు. పాడేరు డిపోకే బస్సులు పరిమితమయ్యాయి. రంపచోడవరం నుంచి చింతూరు మీదుగా పలు సర్వీసులను పోలీసు భద్రత మధ్య నడిపారు. జీపులు, ఇతర ప్రైవేటు సర్వీసులు తిరగలేదు. 108, ఇతర అంబులెన్స్ వాహనాలకు మాత్రమే ఆందోళనకారులు అనుమతి ఇచ్చారు.

మూతపడిన దుకాణాలు

జిల్లా కేంద్రం పాడేరుతో పాటు అన్ని మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్‌లలో దుకాణాలు, పెట్రోల్ బంక్‌లను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేశారు. సంతలు రద్దయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షను వాయిదా వేశారు. ప్రభుత్వ కార్యాలయాలు నామమాత్రంగానే పనిచేశాయి. వాణిజ్య బ్యాంక్‌లు తెరుచుకోలేదు. మన్యం బంద్‌తో జిల్లా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

నేడు తాండవ నల్లగొండమ్మ గిరి ప్రదక్షిణ

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- భక్తులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీకి సిద్ధం



కొండ దిగువన తాండవ రిజర్వాయరు గట్టు కింద నల్లగొండమ్మ ఆలయం (ఇన్‌సెట్) నల్లగొండమ్మతల్లి

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి నల్లగొండమ్మ తల్లి గిరి ప్రదక్షిణకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తాండవ రిజర్వాయరు గట్టు దిగువ ప్రాంతంలో వెలసిన అమ్మవారి ఆలయం కొండ చుట్టూ బుధవారం గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. తొలుత ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని ఏ పని తలపెట్టి ప్రారంభించినా అవలీలగా పూర్తవుతుందన్న అపారమైన నమ్మకం ఈ ప్రాంతవాసుల్లో ఉంది. అమ్మవారి ఆశీస్సులతోనే తాండవ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని చెబుతుంటారు. ఈ ప్రాజెక్టు నిర్మించకముందు నాతవరం, కొయ్యూరు, గొలుగొండ మండలాలకు చెందిన 25 గ్రామాలకు ఇలవేల్పుగా పూజలందుకునేది. ఆ తర్వాత ఇతర ప్రాంతాల భక్తులు ఆరాధిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా ఫిబ్రవరిలో వచ్చే మాఘపౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. నాతవరం మండలంలో తాండవ, మాధవనగరం, ఉటమల్ల, తాళ్లపాలెం, చమ్మచింత, జాలారిపేట, నాతవరం, గంటావారి కొత్తగూడెం, వల్సంపేట, గుమ్మడిగొండ, కె.వి.శరభవరం, పొట్టినాగన్నదొర పాలెం, గొలుగొండ మండలంలో సారికమల్లవరం, పాగచెట్లపాలెం, జోగుంపేట, వెంకటాపురం, అమ్మపేట, చోద్యం, కొయ్యూరు మండలంలో ఆడాకుల రొంగలికొత్తూరు, కృష్ణారం, మాడుగుల బాలారం, కంఠారం, తదితర గ్రామాలు నుంచి భక్తులు రానుండటంతో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ గిరి ప్రదక్షిణ మూడు మండలాల పరిధిలో సుమారుగా ఏడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దారి మధ్యలో తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

ఆలయ చరిత్ర ఇదీ!

మొదట్లో తాండవ రిజర్వాయరు గర్భంలో నల్లగొండమ్మ ఆలయం ఉండేది. తాండవ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆలయంతోపాటు లోతట్టు ప్రాంతంలోని 20పైగా గ్రామాలను ఖాళీ చేయించి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇక్కడ కొండపై గుడి నిర్మించాలని శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో గ్రామస్తులంతా కిందకు వచ్చేయగా, పూజకు నీళ్లతో తీసుకెళ్లిన రాగి చెంబు మరిచిపోయారు. దాని కోసం వెళ్లిన వ్యక్తికి అమ్మవారి అనుగ్రహించి తాను ఇక్కడ నుంచి విసిరిన చెంబు ఎక్కడపడితే అక్కడ గుడి కట్టాలని చెప్పి అదృశ్యమైంది. ఆ ప్రకారం తాండవ రిజర్వాయరు గట్టు దిగువ పడటంతో అక్కడ ఆలయం నిర్మించినట్లు గ్రామపెద్దలు చెబుతున్నారు.

స్కౌట్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా కృషి



శిక్షణ పొందిన స్కౌట్ విద్యార్థులకు సూచనలిస్తున్న అధికారులు



స్కౌట్స్ స్టేట్ డైరెక్టర్ రత్నకుమారికి స్వాగతం పలుకుతున్న గైడ్ కెప్టెన్ నాగజ్యోతి, విద్యార్థులు

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ స్టేట్, అనకాపల్లి జిల్లా సెక్రటరీ కొణతాల రత్నకుమారి మంగళవారం సందర్శించారు. ఆమెకు స్కౌట్ అండ్ బేసిక్ గైడ్ కెప్టెన్ నాగజ్యోతి, స్కౌట్ మాస్టారు ఎన్.గోవింద స్వాగతం పలికారు. గైడ్ కెప్టెన్ నాగజ్యోతి మాట్లాడుతూ పాఠశాల నుంచి 60 మంది ఆసక్తి కలిగిన విద్యార్థులకు స్కౌట్ గురించి అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. బేసిక్ కోర్సు పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగతా స్థాయిల్లో కూడా విద్యార్థులకు తర్ఫీదునిచ్చి అడ్వాన్స్‌డ్ కోర్సులు కూడా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్లు ఎ.షరీఫ్, అడ్వాన్స్‌డ్ గైడు కెప్టెన్ షేక్ ఖరీఫ్ మున్నీసా పలు సూచనలు చేశారు.

అథ్లెటిక్స్ పోటీల్లో తల్లీకుమార్తె ప్రతిభ

భీమునిపట్నం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భీమిలికి చెందిన తల్లీకుమార్తె ప్రతిభ చూపారు. ఇటీవల అనంతపురంలో 43వ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో 60 ఏళ్లు పైబడిన కేటగిరీ 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో కందుకూరి లావణ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల పరుగులో విజేతగా, 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఆమె కుమార్తె రేపాక అపర్ణ 30 ఏళ్లు పైబడిన కేటగిరీలో 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, ఐదు కిలోమీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచారు. మంగళవారం ఇద్దరినీ స్థానికులు అభినందించారు.



800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించిన తల్లి లావణ్య



ఐదు కిలోమీటర్ల పరుగులో ప్రథమ స్థానం సాధించిన కుమార్తె అపర్ణ

ఎం.గదబూరులో జాతీయ ఆరోగ్య మిషన్ బృందం

• గిరిజన ప్రజలకు ఆరోగ్య సేవలపై ఆరా

మాడుగుల రూరల్ : గిరిజన గ్రామాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడానికి వైద్యులు, ఇతర సిబ్బంది సమష్టిగా పనిచేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ సభ్యులు ఎం.శ్రుతి, పి.కన్నన్, పి.కృపాన్, పి.ఎం.జనమనస్ అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ సభ్యులు మంగళవారం మాడుగుల పంచాయతీ శివారు గదబూరు గ్రామాన్ని సందర్శించారు. వారికి పీహెచ్‌సీ వైద్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మిషన్ సభ్యులు ప్రతి ఇంటికి వెళ్లి గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆరోగ్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం వైద్యులు ఇతర సిబ్బందితో సమీక్షించారు. పి.వి.టి.జి. గ్రూపులకు సంచార వైద్య వాహనం ద్వారా ఎన్ని రకాలు మందులు అందిస్తున్నారని కె.జె.పురం పీహెచ్‌సి వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాదు, ఇతర సిబ్బందిని అడిగి



ఎం.గదబూరులో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న జాతీయ బృందం

తెలుసుకున్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు, బాలింతలకు అందుతున్న ఆరోగ్య సేవలు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి అందిస్తున్న సేవలు, మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన ఆరుమాసాల్లో గదబూరులో మలేరియా, డెంగ్యూ, టీబీ, కుష్టువ్యాధి సర్వే ద్వారా ఎవరైనా రోగులను గుర్తించారా అని వైద్యులను ప్రశ్నించారు. అధిక రక్తపోటు, మధుమేహం రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసి, రికార్డులు పరిశీలించారు. వారి వెంట గిరిజన సంక్షేమ పోగ్రాం అధికారి ఎం.రమే



ఆరోగ్య మిషన్ సభ్యులకు స్వాగతం పలుకుతున్న వైద్యాధికారి లీలాప్రసాద్, ప్రసాదుపాత్రుడు, సిబ్బంది

షబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, 104 సర్వీసులు జిల్లా సమన్వయ అధికారి అచ్యుతరావు, కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, కె.లీలాప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ అధికారి ఇ.సుజాత, చోడవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి రమణ, ఎంపిహెచ్‌ఈఎస్‌లు పుష్పకాంతం, వెంకట్రావు, ఏఎన్ఎంలు హేమ, రమణమ్మ, సుగణకుమారి, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు భవానీ, శ్రీలత, భార్గవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట మార్పిడితో మంచి దిగుబడి

• మేడిచర్లలో రైతులకు సూచనలను చేసిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

కె.కోటపాడు: రబీలో రైతులు ఉలవ, జనుము పంటను సాగు చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటు మంచి ఆదాయం వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మండలంలో మేడిచర్ల గ్రామంలో మంగళవారం ఆయన అపరాల పంటలను పరిశీలించారు. జనుము పంటను భూమిలో కలియదున్నడం వల్ల సారవంతంగా మారడంతో పాటు ఖరీఫ్‌లో కలుపు ఉండదన్నారు. రైతులు తప్పకుండా పంట మార్పిడి



మేడిచర్లలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

పద్ధతి పాటించి సాగు చేయాలని తెలిపారు. ఈ-పంట నమోదు కార్యక్రమం ఈ నెలాఖరుతో ముగియనున్నట్లు తెలిపారు. కె.కోటపాడు మండలంలో ఇప్పటి వరకూ 1,006 ఎకరాల్లో పంటలను 997 మంది నమోదు చేయించారన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల వ్యక్తిగత, పట్టాభూమి వివరాలను రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సహాయకులను అడిగి తెలుసుకున్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నమోదు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ఏఈవోలు లైలాదేవి, ప్రియాంక పాల్గొన్నారు.

టీ విక్రయిస్తూ.. తిరిగిరాని లోకాలకు..

• కారు ఢీకొని టీ విక్రయదారుడి దుర్మరణం



సంఘటనా స్థలంలో నర్సింహారావు మృతదేహం

అక్కిరెడ్డిపాలెం : సైకిల్‌పై టీ విక్రయించే వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన షీలానగర్ సిగ్నల్ పాయింట్ నుంచి టోల్ గేటు మధ్య ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుంది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన మొరాల నర్సింహారావు (55) షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద లారీ పార్కింగ్ చేసిన ప్రాంతాల్లో సైకిల్‌పై టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో షీలానగర్ సిగ్నల్ పాయింట్ నుంచి టోల్ గేటు వైపు వెళ్తున్న కారు నర్సింహారావును ఢీకొంది. దీంతో అతడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

‘దుకాణాల ధ్వంసం వెనుక కుట్ర’



సర్పంచ్ వేచలపు దొరబాబు

కె.కోటపాడు : లంకవానిపాలెం గ్రామంలో రోడ్డును ఆనుకొని ఉన్న రెండు దుకాణాలను ఈ నెల 3న గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి ఎ.కోడూరు పోలీసులు కేసు నమోదు చేసినట్టు లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన మల్లువలస రమణ సెలూన్ షాపును, బురుడు త్రిమూర్తులు టైర్ల షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారని, వీరి దుకాణాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని అన్నారు. ఈ షాపుల ధ్వంసం వెనుక అక్కడ ఉన్న సుమారు రూ.4 కోట్లు విలువైన ఎండోమెంట్ భూమిని కాజేసేందుకు ఏమైనా కుట్ర దాగి ఉందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని అన్నారు. ఈ విషయం హోం మంత్రి అనిత దృష్టికి కూడా చేరినట్టు తెలుస్తోందన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు బృందం తనను సంప్రదించగా, తన వద్ద ఉన్న ఆధారాలను వారితో పాటు పోలీసులకు అందించానన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని, దోషులను తొందరలోనే పట్టుకుంటామని సీఐ పైడపునాయుడు తెలిపినట్టు సర్పంచ్ వెల్లడించారు.

400 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



ధ్వంసం చేసిన బెల్లం పులుపు

పాయకరావుపేట: మండలంలో గుంటపల్లి గ్రామ శివారు ఆవ ప్రాంతంలో దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనువాసు తెలిపారు. సారా తయారీ చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని యలమంచిలి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది జె.నాగప్రసాద్, డి.నాగశంకరరావు, ఏఈహెచ్‌సీ బి.రమణ పాల్గొన్నారు.

తీగ లాగితే డొంక కదిలింది

- 2,249 కేజీల నల్లబెల్లం, 40 లీటర్ల సారా స్వాధీనం
- నలుగురిని అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు
- పరారైన మరో ఇద్దరి కోసం గాలింపు



దాడుల్లో పట్టుబడిన నాటుసారా, నల్లబెల్లం

చోడవరం: సారా తరలిస్తున్న ఇద్దరు నిందితులను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా, తీగ లాగితే డొంక కదిలినట్టుగా నల్లబెల్లం గుట్టు రట్టయింది. సారా తయారీకి వినియోగించేందుకు విక్రయిస్తున్న 2,240 కేజీల నల్లబెల్లాన్ని వారి దాడుల్లో సీజ్ చేశారు. ఈ దాడుల్లో సారా తరలిస్తున్న వారిని, నల్లబెల్లం విక్రయం, రవాణా చేస్తున్న నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... చోడవరం ఎక్సైజ్ సీఐ పాపునాయుడు, ఎస్ఐ శేఖరం ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు చోడవరం-చీడికాడ రోడ్డులో చోడవరం శివారు ఐటీ కాలనీ సమీపంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణారాయుడుపేట గ్రామం నుంచి యాంద్ర సురేష్, సిమ్మ శ్రీనువాసరావు స్కూటీపై రెండు క్యాన్లతో 40 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేసి విచారించారు. వీరి విచారణలో సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం గుట్టు రట్టయ్యింది. కె. కోటపాడు మండలం ఎడ్లవానిపాలెం గ్రామంలో ఎడ్ల సత్యనారాయణ నల్లబెల్లాన్ని గుట్టుచప్పుడు కాకుండా సారా తయారీదారులకు విక్రయిస్తున్నట్టు తేలింది. దీంతో ఎక్సైజ్ అధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి దాడులు చేయగా, అక్రమంగా నిల్వ ఉంచిన 2,249 కేజీల నల్లబెల్లం దిమ్మలు బయటపడ్డాయి. ఈ బెల్లాన్ని సీజ్ చేయడంతోపాటు ఇదే ప్రదేశంలో 25 కేజీల అమ్మోనియా దొరకడంతో విక్రయదారు సత్యనారాయణను అరెస్టు చేశారు. ఇంత పెద్దమొత్తంలో ఉంచిన నల్లబెల్లాన్ని వాహనాలపై సరఫరా చేస్తున్న కుక్కల రామును అరెస్టు చేశారు. సారా తయారీ విక్రయాల్లో ప్రధాన నిందితులైన చోడవరం ఐటీ కాలనీకి చెందిన అప్పలరాజు, అప్పారావులను పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు.

తాగుడు, జల్సాల కోసం వాహనాల చోరీ

- పాత నేరస్తుడు అరెస్టు
- ఆటో, రెండు బైక్‌లు స్వాధీనం

యలమంచిలి రూరల్ : మద్యం అలవాటు, జల్సాల కోసం సులభంగా డబ్బు సంపాదించడానికి మోటారు వాహనాలను చోరీ చేస్తున్న నిందితుడిని యలమంచిలి పట్టణ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఆటో, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనపర్చుకున్నారు. దీనికి సంబంధించి వివరాలను సీఐ ఎస్.ధనుంజయరావు పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం రాత్రి విలేకులకు తెలిపారు. ఈ నెల 8వ తేదీన ఎస్.రాయవరం మండలం కోనవానిపాలేనికి చెందిన ఆటో డ్రైవర్ సర్వసిద్ధి వరహాలు, యలమంచిలి పట్టణం దిమిలి రోడ్డు కూడలి వద్ద నిలిపి ఉంచిన తన ఏపీ39వీసీ 0710 రిజిస్ట్రేషన్ నెంబరు గల ఆటో చోరీకి గురైనట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 8న ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు ఆటోస్టాండు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి యలమంచిలిలో కూరగాయలు కొనుగోలు చేసుకుని రావడానికి ఆటోను కిరాయికి మాట్లాడుకున్నాడు. దిమిలి రోడ్డు కూడలి వద్దకు అక్కడ ఆటోను నిలిపి డ్రైవర్ టీ తగడానికి వెళ్లగా, దీన్నే



నిందితుడి వద్ద నుంచి స్వాధీనపర్చుకున్న ఆటో, రెండు బైక్‌లు

అదనుగా భావించిన ఆటోలోని ప్రయాణికుడు ఆటోను అక్కడ్నుంచి తస్కరించుకుపోయాడు. దీంతో నిర్ఘాంతపోయిన బాధితుడు వరహాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో స్థానిక కల్కి పెట్రోల్ బంక్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అచ్యుతాపురం నుంచి రేగుపాలెం వైపు నిందితుడు ఆటోను నడుపుకుంటూ వెళ్తూ పట్టుబడ్డాడు.

ఆటోతో పాటు నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అచ్యుతాపురం మండలం పూడిమడక శివారు కడపాలేనికి చెందిన ఎరిపిల్లి కాసుబాబుగా గుర్తించారు. అతను గతంలో కూడా ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడినట్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ధనుంజయరావు

గుర్తించిన పోలీసులు అతని వద్ద నుంచి జిల్లాలో ఇతర ప్రాంతాల్లో చోరీ చేసిన రెండు ద్విచక్రవాహనాలు (హీరో గ్లామర్,హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్) కూడా స్వాధీనపర్చుకున్నారు. వీటి విలువ సుమారుగా నాలుగు లక్షల రూపాయలు ఉంటుందని సీఐ తెలిపారు.

నిందితుడిపై గతంలో ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌లో వాహనం చోరీకి సంబంధించి కేసు నమోదైందని చెప్పారు. భవన నిర్మాణ పనుల్లో రాడ్ బెండింగ్, డాకింగ్ పనులు చేసుకునే నిందితుడు కాసుబాబు మద్యానికి బానిస కావడంతో సులభంగా డబ్బు సంపాదించడానికి వాహనాల చోరీలకు పాల్పడుతున్నాడన్నారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ కె.సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అనకాపల్లి టౌన్: మండలంలోని బట్టపూడి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామివారి ఆలయానికి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రతినిధి గొంతిన కృష్ణ మాట్లాడుతూ 1992లో గ్రామస్తులు సహకారంతో ఆలయాన్ని నిర్మించామని, అప్పటి నుంచి ఏటా ఫిబ్రవరి 11న వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

గంగాదేవి అమ్మవారి ఉత్సవం



గంగాదేవి దర్శనానికి ఆలయం ముందు బారులు తీరిన భక్తులు

కశింకోట: మండలంలోని జి. భీమవరంలో గంగాదేవి అమ్మవారి ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఎక్కువగా తరలివచ్చి బారులు తీరి దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలలు వగైరా రూపాల్లో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. జనసేన పార్టీ నాయకుడు భీశెట్టి రాంకీ, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్ తదితరులు పూజలు చేశారు.

గాన గంధర్వుడు ఘంటసాల



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న బల్లా

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలలో పద్మశ్రీ ఘంటసాల 51వ వర్ధంతి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి అసోసియేషన్ వ్యవస్థపకుడు బల్లా నాగభూషన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది గీతాలు ఆలపించిన గాన గంధర్వుడు ఘంటసాల తెలుగు వాడు కావడం మనకు గర్వకారణమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు జాతి ఔన్నత్యాన్ని చాటి చెప్పారన్నారు. ఘంటసాల జీవిత చరిత్రపై వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 25 మంది విద్యార్థులు పాల్గొనగా, పది మందిని ఎంపిక చేసి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సభ్యుడు రొబ్బి మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 6,470 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,750	4,740
మొదటి రకం	3,570	4.180
రెండో రకం	3,100	3,660
మూడో రకం	2,800	3,120

అనకాపల్లి సినిమాలు

దాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
ఒక పథకం ప్రకారం	:సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
పట్టుదల	:వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	:శ్రీసత్య(ఉదయం, మొదటి షో)
మదగజ రాజ	:శ్రీసత్య(మేట్నీ, రెండో షో)
భవాని వార్డు	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 74 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-44 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరు సంప్రదించవచ్చు.


గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 348 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.





పట్టణ మెయిన్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు వివిధ రకాల కేబుల్ వైర్లు



రింగ్‌రోడ్డులో విద్యుత్ లైన్ వైర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

మృత్యుపాశంగా కేబుల్ వైర్లు

- పట్టణంలో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న తీగలు
- విచ్చలవిడిగా ఇంటర్నెట్, కేబుల్ టీవీ యాజమాన్యాల వాడకం
- మరమ్మతుల సమయంలో లైన్‌మన్ల ఇబ్బందులు
- వాహనదారులకు, పాదచారులకు ప్రమాదాలు

అనకాపల్లి: పట్టణంలో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్, ఇతర వైర్లు మృత్యుపాశంగా మారుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వైర్లు తెగిపోయి రహదారులపై విచ్చలవిడిగా ఉండడంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురికావలసిన పరిస్థితి ఏర్పడుతుంది. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రైవేట్ సంస్థలు విద్యుత్ స్తంభాలను తమ సొంతానికి వాడుకుంటున్నారు. వాడవాడలా విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం రూ.కోట్లు చెల్లించి స్తంభాలను ఏర్పాటు చేస్తుండగా.. కొన్ని ప్రైవేటు ఇంటర్నెట్లు, కేబుల్ టీవీ సంస్థలు, ఇతర వర్గాల ప్రజలు ఇష్టారాజ్యంగా కేబుళ్లను స్తంభాల ద్వారా అనుసంధానిస్తాయి. ఫలితంగా విద్యుత్ స్తంభాల వద్ద ఏదైనా సమస్య ఎదురైతే ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేయలేకపోతున్నారు. అనుమతులు లేకుండా కేబుళ్లు ఏర్పాటు చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్న నిబంధన ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రైవేట్ సంస్థల కేబుల్ విస్తరణ దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా కొనసాగుతోంది. పట్టణంలో ఏర్పాటు చేసిన త్రీఫేస్, టూఫేస్, చివరికి హైటెన్షన్ విద్యుత్ స్తంభాలను ప్రైవేట్ సంస్థల యాజమాన్యం అనధికారికంగా వాడుకుంటున్నారు. కేబుళ్ల కారణంగా కొన్ని ప్రాంతాల్లో స్తంభాలు నేలకొరుగుతున్నాయి. పలు చోట్ల ప్రమాదాలు జరుగుతుండటంతో ఇటీవల ట్రాన్స్‌కో ఎండీ అనధికారికంగా విద్యుత్ స్తంభాలకు కట్టిన కేబుళ్లను తొలగించాలని హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ ప్రైవేటు సంస్థలు మాత్రం పట్టించుకోవటం లేదు. దాంతో ఒకరిని చూసి మరొకరు ఇష్టారాజ్యంగా స్తంభాలను కేబుళ్ల కోసం వాడుకుంటున్నారు.

లైన్‌మన్లకు ఇబ్బందిగా మారిన కేబుళ్లు...

పట్టణ వీధుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు లైన్‌మెన్లు తనిఖీ చేసి మరమ్మతులు చేయడం సహజం. ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన కేబుళ్లతో వారు స్తంభాలు ఎక్కాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉంటుందో తెలియని పరిస్థితి. తరచూ విద్యుత్ తీగల్లో స్పార్క్ వచ్చి తీగలు కాలి కేబుళ్లపై పడి మంటలు చెలరేగిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ శాఖ తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. స్తంభాలకు కుప్పలు తెప్పలుగా కడుతున్న కేబుల్ వైర్లతో నష్టం వాటిల్లుతున్నప్పటికీ అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ పరిధిలో విద్యుత్ శాఖ డి-1, డి-2 సెక్షన్ పరిధిలో 35 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లా కేంద్రంగా అనకాపల్లి పట్టణం అభివృద్ధి చెందడంతో జనసాంద్రత పెరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖ ట్రాన్స్‌ఫార్మర్లు కొత్తగా డి-1 సెక్షన్ పరిధిలో గతంలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా మరో నాలుగు కొత్తవి ఏర్పాటు చేసి లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. కొత్తగా ఏర్పాటు చేసిన స్తంభాలకు కేబుళ్ల వైర్లు దర్శనమిస్తున్నాయి. వీధిల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు వేలాడడంతో ఆయా ప్రాంతాల చిన్నారులు, వైర్లతో ఆటలాడుకుంటున్నారు.

ప్రమాదకరంగా కేబుల్ వైర్లు



పట్టణ రహదారులపై విచ్చలవిడిగా కేబుల్ వైర్లు తెగి పడిపోతున్నాయి. వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. మెయిన్‌రోడ్డులో వైర్లు ఎలా ఉన్నా, వీధి రహదారుల్లో వైర్లు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి సమయంలో వాహనదారులు కేబుల్ వైర్లు తగిలి ప్రమాదాలకు గురవుతున్నారు.

– ఎస్.రాజు, అనకాపల్లి

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

కేబుల్ వైర్ల ఏర్పాటుకు విద్యుత్ స్తంభాలను వినియోగించడం సరైన పద్ధతి కాదు. ప్రభుత్వం అనుమతించిన వైర్లు ఉంచి మిగిలిన వాటిని దశలు వారీగా తొలగిస్తాం. కేబుల్ వైర్లు కారణంగా లైన్‌మెన్లు మరమ్మతులు చేయడం కష్టంగా మారింది. కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం.

– కె.రాజశేఖర్, విద్యుత్ శాఖ ఈఈ, అనకాపల్లి

పౌష్టికాహారంతో క్యాన్సర్‌ను జయించవచ్చు



మాట్లాడుతున్న ఏసీడీపీవో శశికళ

అనకాపల్లి టౌన్: పౌష్టికాహారంతో క్యాన్సర్ జయించవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీవో టి. శశికళ పేర్కొన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ నివారణకు, వ్యాధి రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. బాల్య వివాహాలు, పోక్సో యాక్ట్, మత్తు పదార్థాలకు బానిసవుతున్న యువత, వీటి వల్ల వచ్చే అనర్థాలు, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఉపయోగాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, కొత్తూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, అంగన్వాడీ కార్యకర్తలు మేరి సుజాత, చుక్కా లక్ష్మి, రత్నం, మహిళా పోలీసులు టి. శిరీష, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని వాసవీ బాలవిహార్ పాఠశాలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ప్రభావతి మాట్లాడుతూ మంచి పోషకాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

వెంకుపాలెం సర్పంచ్‌కు పరామర్శ



సర్పంచ్ నాగేశ్వరరావును పరామర్శించిన భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు

అనకాపల్లి: మండలంలో వెంకుపాలెం గ్రామ సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావును మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల కాలంలో నాగేశ్వరరావు అనారోగ్యంతో పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరల చట్టం చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

అనకాపల్లి టౌన్: రైతులు పండించే వివిధ పంటలకు గిట్టుబాటు ధరల చట్టం పార్లమెంట్‌లో చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం అచ్యుతాపురం మండలం నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈ నెల 14న ఢిల్లీలో దల్లే వాల్ కమిటీతో రైతు సంఘాలతో జరిగే చర్చలు జయప్రదం కావాలని, వివిధ రకాల 23 పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులకు రుణమాఫీ చేయాలని, తదితర డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ సిబ్బందికి ఇచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు కె. రామ సదాశివరావు, నాగేశ్వరరావు, కొండకర్ల పాల సంఘం అధ్యక్షుడు నూకరాజు, ప్రకాష్, బుద్ద రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

వాడపాలెం తీరంలో వ్యర్థాల తొలగింపు



వాడపాలెం తీరంలో వ్యర్థాలను తొలగిస్తున్న యువకులు

రాంబిల్లి(యలమంచిలి): ప్లాస్టిక్ వ్యర్థాలతో వాడపాలెం తీరాన్ని కలుషితం చేయవద్దని మాఘ పౌర్ణమికి వచ్చే భక్తులను వాడపాలెం యువకులు కోరారు. మంగళవారం గ్రామానికి చెందిన యువకులు అందరూ నడుంకట్టి తీరంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సంచులలో వేసి తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ మాఘ పౌర్ణమి జాతరకు వచ్చే భక్తులు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం ఎక్కడిపడితే అక్కడ వేయకుండా నిర్దేశించిన ప్రదేశంలోనే వేయాలని సూచించారు. తీరంలో శివపార్వతుల విగ్రహాలు, గంగమ్మతల్లి ఆలయం, తీరంలో చెత్తతో పాటు పగిలిన గాజు సీసాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు జగదీష్, సోమేష్, వెంకటేష్, శివ, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల సాధనకు పక్కా ప్రణాళికలు



మాట్లాడుతున్న ఎంఈవో జగ్గారావు

రోలుగుంట: శని,ఆదివారాలు పది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతుందని ఎంఈవో పూడి జగ్గారావు తెలిపారు. పది ఫలితాలు సాధన, చర్యల గురించి మంగళవారం రాత్రి ఆయన మాట్లాడారు. మండలంలో ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీతో కలిపి తొమ్మిది పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు 331 మంది హాజరు కానున్నారన్నారు. శతశాతం ఫలితాలు సాధనలో భాగంగా విద్యార్థులకు పాఠశాలలో బోధనా సమయానికి ముందు, తరువాత గంటన్నర ప్రత్యేక బోధన, విదార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి నైట్ స్టడీ పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రధానంగా రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసి, విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తామన్నారు.

వసతి గృహాన్ని పరిశీలించిన తహసీల్దార్

కశింకోట: స్థానిక సమగ్ర బాలికల వసతి గృహాన్ని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సర్వ శిక్ష అభియాన్ నిధుల నుంచి రూ.9.20 లక్షలతో చేపట్టిన వసతి గృహం ప్రహరీ పునర్నిర్మాణ విషయంలో స్థానిక కాలనీ వాసుల నుంచి అభ్యంతరం రావడంతో పరిశీలించారు. ఇందుకు సంబంధించిన ఆధార పత్రాల కోసం ఆరా తీశారు. వాటిని తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు. తమకు రహదారి సదుపాయం కల్పించాలని స్థానికులు కోరారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి ఈశ్వరరావు, మండల సర్వేయర్ రామారావు, వసతి గృహం, రెవెన్యూ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా బల్లల పండుగ

కశింకోట: గవరపేటలో రెండో రోజు మంగళవారం రజకులు బల్లల పండుగ ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక శారదానది ఒడ్డున బల్లల వద్ద, ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందోత్సాహాలతో గడిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చనని బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి తెలిపారు. మార్చి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వ తరగతి చదువుతున్న వారు 5వ తరగతిలో ప్రవేశానికి, పదో తరగతి చదువుతున్న వారు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులు అని తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 4న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్న 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్మీడియేట్‌కు మధ్యాహ్న 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయింపు జరుగుతుందని తెలిపారు.

మాఘపౌర్ణమి జాతరకు వేళాయె



విద్యుత్ లైట్లతో ముస్తాబైన మాధవస్వామి ఆలయం



మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక గదులు



తీరం రహదారిలో విద్యుత్ తోరణాలు

- పుణ్య స్నానాలకు ముత్యాలమ్మపాలెం తీరంలో ఏర్పాట్లు
- అందంగా ముస్తాబైన మాధవస్వామి ఆలయం

పరవాడ: మాఘపౌర్ణమి జాతరకు ముత్యాలమ్మపాలెం తీరం ముస్తాబైంది. తీరంలో వెలసిన మాధవస్వామి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో అలంకరించారు. గ్రామ కూడలి నుంచి తీరం వైపు వెళ్లే రహదారికి ఇరువైపుల విద్యుత్ తోరణాలతో ముస్తాబు చేశారు. తీరంలో రాత్రంతా జాగరణ చేసిన భక్తులతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి తరలిరానున్న వేలాది మంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. బుధవారం సూర్యోదయాన తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలోని మాధవస్వామిని దర్శించుకోవడానికి వీలుగా సర్వం సిద్ధం చేశారు. పుణ్య స్నానాలు ఆచరించే మహిళలు దుస్తులు మార్చుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. స్నాన ఘట్టాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందుస్తుగా గజ ఈతగాళ్లను నియమించారు. మంగళవారం రాత్రికి భక్తుల సౌకర్యార్థం తీరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సూరాడ సోమునాయుడు చెప్పారు. మాఘపౌర్ణమి జాతరలో చేసిన ఏర్పాట్లను మంగళవారం పరవాడ తహసీల్దారు ఎస్వీ అంబేడ్కర్, ఎంపీడీవో ధర్మారావు, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావులు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను సూచించారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తీరంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ నియంత్రణకు అదనపు పోలీసు బలగాలను నియమిస్తున్నామని సీఐ తెలిపారు. భక్తులను చేరవేయడానికి కూర్మన్నపాలెం స్టీల్ డిపో నుంచి అదనపు బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ పేర్కొన్నారు.

వైభవంగా గ్రామదేవతల ఉత్సవాలు



గంగాలమ్మ తల్లిని దర్శించుకున్న బూడి ముత్యాల నాయుడు, మలసాల భరత్‌కుమార్



మార్టూరులో పరదేశమ్మను దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: మండలంలో రెండు గ్రామాల్లో గ్రామ దేవతల ఉత్సవాలు మంగళవారం జరిగాయి. మూలపేట గ్రామంలో గంగాలమ్మ జాతరను పురస్కరించుకుని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత జిల్లాలో గ్రామ దేవతల పండగలు ఏప్రిల్ వరకూ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారన్నారు. వీటిని ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించే విధంగా ఆలయాల కమిటీ సభ్యులు చర్యలు చేపట్టాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ మండలాధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నాయకులు మలసాల కుమార్‌రాజా, కోరుకొండ రాఘవ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్టూరు గ్రామంలో పరదేశమ్మను దర్శించుకున్న భరత్‌కుమార్

మండలంలో మార్టూరు గ్రామంలో పరదేశమ్మ అమ్మవారు పండగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా అమ్మవారిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు భరత్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న దేవితల్లి తీర్థం



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరీ దేవి అమ్మవారు

దేవరాపల్లి: దేవరాపల్లి గ్రామ ప్రజలు ఆరాధ్య దైవం శ్రీ ఉమామహేశ్వరీ దేవి (దేవితల్లి) తీర్థం, కళ్యాణ మహోత్సవాలను ఆఖరి రోజు బుధవారం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 8 నుంచి ప్రారంభమైన తీర్థమహోత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి ప్రతి రోజూ పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ముగింపోత్సవాల సందర్భంగా ఆలయానికి వెళ్లే దారిలో విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పోటీలను నిర్వహించి, విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.18వేలు, రూ.16 వేలు, రూ.14 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ. 2వేలు చొప్పున నగదు బహుతులను అందజేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఫిషర్‌మెన్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక

చోడవరం : చోడవరం గౌరీ శంకర్ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు మంగళవారం జరిగాయి. నూతన అధ్యక్షుడిగా బెరా శివాజీ, ఉపాధ్యక్షుడిగా బెరా వెంకట్రావు, డైరక్టర్లుగా ఇంటి ఈశ్వరరావు, ఇంటి శంకరరావు, మురమర్ల రాము, వానపల్లి దేముళ్లు, బెరా శ్రీను ఎన్నికయ్యారు. 07మంది సభ్యులు ఉన్న సొసైటీలో 188 మంది సభ్యులు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.